# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 06 జనవరి , 2026 | పేజీలు : 06



వివరాలు మెయిన్‌లో

**తురక కాశ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్సీ సత్యం**

## బిసి హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

### యాసిడ్ తాగిన విద్యార్థిని పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లా కేంద్రంలోని బిసిడి హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్న ఎర్రబోయిన హేమశ్రీ(19) అనే విద్యార్థిని అనారోగ్య కారణాలతో బాత్రూంలు కడిగే యాసిడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పరిస్థితి విద్యార్థిని విషమంగా ఉండడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన తోటి విద్యార్థినిలు తెలిపిన వివరాలు ఇల ప్రకారం అనుముల మండ లం హాజారిగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు,లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమార్తె హిమశ్రీ నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న బిసి హాస్టల్‌లో ఉంటూ ఎన్‌జి కళాశాలలో బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం తెల్లవారుజామున బాలిక హాస్టల్ ఆవరణలో ఉన్న బాత్రూంలు కడిగే యాసిడ్‌ను సేవించి రూమ్‌లోకి వచ్చి వాంతులు చేసుకుంది. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు విషయాన్ని వెంటనే వార్డెన్ జ్యోతి దృష్టికి తీసుకెళ్లి చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాలని సూచించడంతో వార్డెన్ జ్యోతి బాలికను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. విషయం తెలిసిన వెంటనే డిబిసీడబ్ల్యు ఓ సంజీవయ్యతో పాటు పలువురు అధికారులు ఆసుపత్రి వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.ప్రస్తుతం బాలిక పరిస్థితి విషమంగా ఉందని నాలుగు రోజుల తర్వాత కానీ ఏమి చెప్పలేమని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువు విద్యార్థి సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

**హేమశ్రీని పరామర్శించిన జిల్లా కలెక్టర్**

అనారోగ్య కారణాలతో యాసిడ్ తాగి జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హేమశ్రీ ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి హేమశ్రీని పరామర్శించారు.అమ్మాయి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ల ద్వారా అడిగి తెలుసుకోవడమే కాకుండా,విద్యార్థినితో మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారు. విద్యార్థిని తండ్రి వై. వెంకటేశ్వర్లుతో కలెక్టర్ మాట్లాడుతూ సంఘటన జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హేమశ్రీ తండ్రి తన కూతురుకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ పం పించాలని కోరగా,జిల్లా కలెక్టర్ తక్షణమే నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ పంపించేందుకు ఏర్పాటు చేశారు జిల్లా కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,జిజిహెచ్ సూపరింటిండెంట్ నేత నరసింహారావు ఉన్నారు.

## మహిళా సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలతో మహిళల్లో ఆర్థిక అభివృద్ధితో పాటు సామాజిక గౌరవం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అసెంబ్లీలో పేర్కొన్నారు. సోమవారం శాసనసభలో మహిళా సంక్షేమంపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో మహిళా క్యాంటీన్ల ఏర్పాటు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని, దీనిని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, అక్కడ మహిళా క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్కను కోరారు. తద్వారా స్థానిక మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతారని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేయడం వల్లే సర్పంచ్ ఎన్నికల్లో 70 శాతం మెజార్టీ రావడం జరిగిందని, ఇది మహిళా శక్తికి నిదర్శనమని అయిలయ్య తెలిపారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకులకు మహిళలను యజమానులను చేయడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలు వారి ఆత్మగౌరవాన్ని పెంచాయని కొనియాడారు. గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండు సంవత్సరాల పాలనలోనే మహిళలు కాంగ్రెస్‌ను తమ కుటుంబంగా భావిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం విస్మరించిన వడ్డీ లేని రుణాలను ప్రస్తుత ప్రభుత్వం మూడు దఫాలుగా అందించి మహిళా సంఘాలకు ఊపిరి పోసిందన్నారు. గ్రామాల్లో మహిళలందరూ ఇందిరమ్మ చీరల పంపిణీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, 18 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వృద్ధ మహిళల వరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ చీరలు పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గత పాలకులు నాసిరకం చీరలు పంపిణీ చేసి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, కానీ ఇప్పుడు నేతన్నలతో నేయించిన విలువైన చీరలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. పుట్టింటి నుంచి తమ అన్న రేవంత్ రెడ్డి పంపిస్తున్న కానుకగా ఇందిరమ్మ చీరలను కట్టుకోవడానికి రాష్ట్ర మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సభలో వివరించారు.

## ప్రజా సమస్యలపై సిపిఐ పోరాటం

### 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

### సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడి



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం) :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆత్మకూరు మండల కౌన్సిల్ సమావేశం పిఎస్ గార్డెన్‌లో కూరెళ్ళ మచ్చగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ భారత గడ్డపై సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు సానుభూతిపరులు వేల సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నాటి స్వాతంత్ర ఉద్యమం నుండి మొదలుకొని కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ సాయుధ పోరాటంలో 4000 మంది మృతవీరులైనప్పటికీ వెనుకకు తగ్గకుండా సమరశీల పోరాటం నిర్వహించి నైజాం నవాబులు పారదోలడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. దున్నే వానికి భూమి, భూ పోరాటాలు, భూదానాలు చేసి పేదల పక్షాన నిలిచిందని ఆయన అన్నారు. కార్మికుల, కర్షకుల పక్షాన నిలిచి ప్రతినిత్యం ప్రజా సమస్యల మీద పోరాడుతూ అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా పోరాటాలు నిర్వహిస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చేడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, కుసుమాని హరిశ్చంద్ర, చేనేత సంఘం రాష్ట్ర నాయకులు పాసికంటి లక్ష్మీ నరసయ్య, మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శిలు ఎండి నయీమ్, బత్తిని నరేష్, మండల కార్యవర్గ సభ్యులు గుర్రం రాజమణి, జక్క దయాకర్ రెడ్డి, కసరబోయిన సత్తయ్య, కల్వల నరసయ్య, మారుపాక అంజయ్య, కౌన్సిల్ సభ్యులు మజ్జిగ నరసయ్య, సుల్తాన్ పురుషోత్తం, సోమన బోయిన నరసింహ, దుర్గపతి నరసయ్య, తాళ్లపల్లి నర్సయ్య, సుదగాని పృధ్విరాజ్, కొమ్ము కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

### పనుల్లో అక్రమాలు, మస్టర్‌లో కూలీల

## సంతకాలు లేకుండానే బిల్లులు



వివరాలు మెయిన్‌లో



## లైబ్రరీని సందర్శించిన పోచంపల్లి లీడేల్ స్కూల్ విద్యార్థులు

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి గ్రామంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కూరెళ్ల విఠలాచార్య ఏర్పాటు చేసిన లైబ్రరీని యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లికి చెందిన లీడేల్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సోమవారం సందర్శించారు. వెల్లంకి గ్రామానికి చెందిన కర్నాటి ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కర్నాటి శ్రవణ్ కుమార్ విఠలాచార్యను శాలువాతో సన్మానించి గ్రంథాలయం కోసం పుస్తకాలను, వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటి ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షులు కర్నాటి మహదేవ్, కర్నాటి నరసింహ, గంజి భాస్కర్, లైబ్రేరియన్ తాటిపాముల స్వామి, వనం శిరీష, స్కూలు ప్రిన్సిపాల్ కాశీనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని మోదినిగూడెం గ్రామ పంచాయతీ భవనం నూతన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఆ గ్రామ సర్పంచ్ బిరవోలు సుకన్య శేఖర్ రెడ్డి,ఉప్ప సర్పంచ్ దేగల అరుణ మాజీ ఎంపిటిసి వీరార్జున్ రెడ్డి,వార్డు సభ్యులు అనుముల భాస్కర్,జెర్రిపోతుల సతీష్,పగడాల నాగయ్య,ముడి యుగంధర్,పగడాల జానయ్య,వలిశెట్టి జ్యోతిబసు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అనుముల నాగయ్య,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిరవొలు యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో నకిరేకల్ జడ్పిహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/నకిరేకల్** : జిల్లా స్థాయిలో నిర్వహించిన గణిత, విజ్ఞానశాస్త్రం, పర్యావరణ ప్రాజెక్టుల వైజ్ఞానిక ప్రదర్శ2025/26లో నకిరేకల్ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేషప్రతిభకనబరిచారు. వ్యర్థాల నిర్వహణ అంశంలో భాగంగా జూనియర్ విభాగంలో ఎనిమిదో తరగతి (బి.విభాగం) విద్యార్థి కె. రవితేజ ప్రథమ బహుమతి సాధించగా, వ్యర్థాల నిర్వహణపై నిర్వహించిన ఉపన్యాస విభాగంలో ఎనిమిదో తరగతి (సి.విభాగం) విద్యార్థిని జి. వినీల మొదటి బహుమతి సాధించారు.ఈ ప్రతిభతో వారు జనవరి 6,7,8,9 తేదీలలో కామారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి విజ్ఞానప్రదర్శనకుఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కె.రాములుని,పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని మండల విద్యాశాఖ అధికారి మేకనాగయ్య అభినందించారు.



# తప్పుల తడకగా కోదాడ మున్సిపాలిటీ ఓటర్ల జాబితా



**ప్రజాపక్షం/కోదాడ:** త్వరలో జరగనున్న కోదాడ మున్సిపాలిటి ఎన్నికల కోసం సిద్ధం చేసిన ఓటర్ జాబితాలో అనేక తప్పులు ఉన్నాయని, 15 సంవత్సరాలుగా మున్సిపాలిటి పరిధిలో నివసించని వారి పేర్లు, గడిచిన ఐదు సంవత్సరాలలో చనిపోయిన వారి పేర్లు కూడా ఈ ఓటర్ల జాబితాలో పొందుపర్చడం జరిగిందని బిఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఓటర్ జాబితాలో తప్పులు ఉన్నాయని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటి పరిధిలో ఉన్న బూత్ లెవల్ ఆఫీసర్స్ వారి అసమర్థత కారణంగా కోదాడ మున్సిపాలిటిలో 35 వార్డులలో ఉన్న ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని నిర్ధారించారు. తక్కువ కాలంలో ఓటర్ల జాబితాను సరి చేయటానికి సమయం చాలదని, వీటిని మున్సిపల్ కమిషనర్, అధికారులు, బూత్‌లెవల్ ఆఫీసర్లు పూర్తిగా పరిశీలన చేసి సరైనటువంటి ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ఎన్నికలు నిర్వహించాలని బిఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎస్‌కె నయీం, కర్ల సుందర్‌బాబు, కాసాని మల్లయ్యగౌడ్, చీమ శ్రీనివాసరావు, బొజ్జ గోపి, కుడుముల సైదులు, గుండె రాజేష్, గడ్డం యేసు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి పోటీలకు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. గత ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటి వారు నిర్వహించిన పోటీలలో పాఠశాల తరపున విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 10 విభాగంలో 300 మీటర్ల రన్నింగ్‌లో 4వ తరగతి విద్యార్థి సౌరవ్ మహాకుడ్, అండర్ 14 విభాగంలో 60 మీటర్ల రన్నింగ్‌లో 6వ తరగతి విద్యార్థిని చింతకాయల నిత్య, 400 మీటర్ల రన్నింగ్‌లో 2వ తరగతి విద్యార్థి చింత విక్రాంత్, అండర్ 14 విభాగంలో 60 మీటర్ల లాంగ్ జంప్‌లో 8వ తరగతి విద్యార్థి గుండెబోయిన సాయి ప్రణీత్‌లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి అథ్లెట్ పోటీలలో వీరు జిల్లా తరపున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం రోజున విద్యార్థులను పాఠశాల వ్యవహర్త పెద్ది నరేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు కన్నెబోయిన లింగస్వామి, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం



**ప్రజాపక్షం/నకిరేకల్** : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, అప్రజాస్వామిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు,రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం పట్టణంలోని నర్రా రాఘవరెడ్డి భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం,సీఐటీయూ,రైతు సంఘాల ఆధ్వర్యంలో కందాల ప్రమీల అధ్యక్షతన లేబర్ కోడ్లు, విబిఆర్‌జి రామ్ జి చట్టం,జాతీయ విత్తన విధానం,విద్యుత్ (2025) సవరణ బిల్లులను రద్దు చేయాలనే డిమాండ్‌తో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ 2005లో యూపీఏ1 ప్రభుత్వ హయాంలో వామపక్ష ఎంపీల పోరాటంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు, సీఐటీయూ నాయకులు చింతపల్లి బయన్న,జిట్టా నాగేష్, పెంజర్ల సైదులు,గీత సంఘం నాయకుడు రాచకొండ వెంకన్న,రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బండపల్లి కోమరయ్య,డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్,మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు జిట్టా సరోజ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రోడ్డుపై ప్రయాణం చేస్తున్న ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరీన్ కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆమె న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులతో కలిసి కోర్టు నుండి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కోర్టు ప్రాంగణంలో సభికులనుద్దేశించి మాట్లాడారు. మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించి వాహనాలు నడపటం చట్ట విరుద్ధమన్నారు. రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన భద్రత సూచికలను తప్పని సరిగా పాటించాలన్నారు. వాహనాలు నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడటం నేరమన్నారు. రోడ్డు నియమాలను ఉల్లంఘించిన వారు మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం శిక్షకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నగేష్ రాథోడ్, ఎంఎస్ రాఘవరావు, కొట్టు సురేష్, పాలేటి శ్రీనివాసరావు, పసుపులేటి వీరు, సైదా హుస్సేన్, నారాయణరెడ్డి, నాగపాషా, అడవి రాముడు, రామారావు, ఎస్ఐ మోహన్‌బాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.




## సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు వేలాదిగా తరలుదాం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం పందుల యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కే.శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడుతూ దేశ కార్మిక, రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉన్నదని, సుదీర్ఘ పోరాట చరిత్రను ప్రజలకు గుర్తు చేసేలా ఖమ్మంలో శతాబ్ద ఉత్సవాలు నిర్వహించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, నరసింహ, వీర మల్ల యాదయ్య, నల్లవెల్లి ముత్యాలు, బద్దుల పెంటయ్య, కొప్పు సుధాకర్, గ్రామ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఆదర్శ విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/నిడమనూరు:**ఈనెల 7,8,9 తేదీలలో కామారెడ్డిలో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు నిడమనూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి నిర్మల తెలిపారు,ఈనెల 2,3 తేదీలలో నల్లగొండలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫయిర్ లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు పలు బహుమతులను గెలుచుకున్నారు, సీనియర్స్ విభాగంలో కే వెంకట్ (పదవ తరగతి విద్యార్థి) జూనియర్స్ విభాగంలో ఈ పవన్ కుమార్ (8వ తరగతి విద్యార్థి) ప్రథమ బహుమతులను డిఇఓ బిక్షపతి చేతుల మీదుగా అందుకున్నారు, డి పృథ్వీతేజ (9వ తరగతి విద్యార్థి) సీనియర్స్ విభాగంలో తృతీయ బహుమతి జూనియర్స్ విభాగంలో టి శ్రీ లక్ష్మీ తేజ (ఎనిమిదవ తరగతి విద్యార్థిని) రెండవ బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా బహుమతులు అందుకున్న విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ బి నిర్మల ఉపాధ్యాయులు సైదులు,నరేష్ కుమార్, వెంకటేశ్వర్లు,సంధ్య,చంద్రశేఖర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

## వాహనదారులకు అవగాహన

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రతి కారు వాహనదారుడు ముందు కూర్చునే ముందు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని కోదాడ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎస్‌కె జిలానీ అన్నారు. సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సీటు బెల్టు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీటుబెల్టు వాడకం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం తీవ్రత గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. సీటుబెల్టు ధరించకపోవడం చట్ట ఉల్లంఘనతో పాటు ప్రాణాలకు ప్రమాదమని హెచ్చరించారు. అనంతరం కోదాడలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ జిఆర్ చరణ్, యూనిట్ సిబ్బంది, స్థానిక నాయకులు, రవాణ శాఖ సలహా మండలి సభ్యుడు పార సీతయ్య పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌టి మాజీ చైర్మన్‌కు నివాళి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో గతంలో సేవలందించిన మాజీ చైర్మన్ ప్రొఫెసర్ యంయన్ రెడ్డి మృతి చెందిన సందర్భంగా సోమవారం సంస్థ చైర్మన్ డా.యన్ కిషోర్ రెడ్డి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు ఘనంగా అర్పించారు. ఆయన సంస్థకు చేసిన సేవలు వివరించారు. సంస్థ ఉద్యోగులు వై.యస్ చక్రవర్తి, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యయ వివరాలను అందజేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్** : ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు ఆ ఎన్నికలలో ఖర్చు చేసిన వ్యయ వివరాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని నకిరేకల్ ఎంపీడీవో జె. వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికలలో గెలిచిన,ఓడిన ప్రతి ఒక్కరు ఎన్నికల వ్యయ బిల్లులను అందజేయాలన్నారు.ఆ బిల్లులను టీ పోల్ లో నమోదు చేయాల్సి ఉందన్నారు.ఎన్నికలు జరిగినా 45 రోజుల్లో వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాల్సి ఉన్నందున వెంటనే ఖర్చు వివరాలను అందజేయాలన్నారు. లేనిచో అనర్హత వేటు పడే అవకాశం ఉందని తెలిపారు.

## నిధుల దుర్వినియోగం చేసిన సర్పంచ్ కార్యదర్శులపై విచారణ జరపాలి



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని పలివెల గ్రామపంచాయతీలో అప్పటి సర్పంచ్ గజ్జల బాలరాజ్ గౌడ్,పంచాయతీ కార్యదర్శి వీరిద్దరూ కలిసి రెండు కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని గ్రామంలో ఏలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అభివృద్ధి పేరుతో నిధులను దుర్వినియోగం చేసిన సర్పంచ్ కార్యదర్శుల పైన విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్,వార్డ్ మెంబర్లు కలిసి సోమవారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉప సర్పంచ్ చెరుకు సునీత సైదులు,వార్డు మెంబర్లు బత్తుల వెంకన్న,ఆనగంటి కృష్ణ,బత్తుల ప్రవీణ్ గోసు కొండ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాసరాజు యాదగిరి తదితరులు ఉన్నారు.

## సర్పంచ్‌ను సన్మానించిన ప్రధానోపాధ్యాయులు

**ప్రజాపక్షం/అర్వపల్లి** : సూర్యనాయక్ తండ గ్రామ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన లునావత్ కృష్ణ నాయక్, ఉప సర్పంచ్ దేగవత్ లక్ష్మి బాలాజీనాయక్ లను సూర్యనాయక్ తండ గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైరంకొండ రమేష్, బయ్య లింగయ్య యాదవ్, అంగన్‌వాడీ టీచర్లు శివరంజిని, విజయలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు భూక్య నరసింహ, లునావత్ బిక్కు, లునావత్ బుజ్జి, భద్రు నాయక్, వీరన్న నాయక్ పాల్గొన్నారు.

## అధికారులకు, సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సన్మానం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని గానుగబండ గ్రామసర్పంచ్ కడియాల పద్మ అప్పయ్య, ఉప సర్పంచ్ నాగుల్‌మీరాలు మండలంలోని వివిధ శాఖల అధికారులను శాలువాలతో సన్మానించారు. తహసిల్దార్ స్రవంతి, ఎంపిడివో సరోజన, ఎస్ఐ నరేష్, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రీతమ్‌కుమార్, పలువురు అధికారులను వారి వారి కార్యాలయాల్లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోకల వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, గోదుమల ఈశ్వరచారి, కేసర చిన్న వెంకయ్య, కొల్లయ్య, వీరబాబు, జానపాటి సైదులు, ముళ్ల కోటయ్య పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు వేదికపై సైదులు కవిత్వం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 2026లో నకిరేకల్ మండలంచందుపట్ల గ్రామానికి చెందిన నాగార్జున డిగ్రీ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సైదులు పాల్గొని తన కవితా ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారు.మహాసభల సందర్భంగా సమాజంలో క్రమంగా తగ్గిపోతున్న మానవతా విలువలు,ఆచాసాంప్రదాయాల అవసరంపై సైదులు చేసిన ఆలోచనాత్మక ప్రసంగం మేధావుల ప్రశంసలను అందుకున్నారు. అనంతరం శ్రీ జాషువా, కరుణశ్రీ వేదికలపై నిర్వహించిన ‘తెలుగు తల్లికి సహస్ర కవిత నిరాజనం' కవి సమ్మేళనంలో పాల్గొని కవితా పఠనం చేసి శ్రోతలను ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా మహాసభల నిర్వాహకులు సైదులును మెడల్‌తో పాటు అభినందన ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సన్మానించారు.

## గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ



**ప్రజాపక్షం/ఆలేరు :** గొర్రెలకు, మేకలకు ప్రభుత్వం అందించే ఉచిత నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని ఆలేరు గొర్రెల కాపరి సంఘం అధ్యక్షులు జెల్లీ నర్సింహులు అన్నారు. సోమవారం ఆలేరు మున్సిపల్ కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు మేకలకు ఉచిత నట్టల నివారణ మందులను పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించడం ద్వారా జీవాల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మండల పశువైద్యాధికారి డాక్టర్ చైతన్య, గొర్రెల పెంపకదారులు కవాటి బక్కయ్య, జల్లి పర్వతాలు, జూకంటి శ్రీశైలం, ఎగిరి వెంకటేష్, బండ శీను, రాగుల శంకర్, ఎ.రమేష్, పశు వైద్యులు స్వామి, రమ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్‌ను సద్వినియోగం

**ప్రజాపక్షం/నకిరేకల్** : రాష్ట్రప్రభుత్వంఅందుబాటులోకి తీసుకొచ్చిన యూరియా బుకింగ్ మొబైల్ యాప్‌ను రైతులుపూర్తిగాసద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ అగ్రికల్చర్ ఇన్చార్జి ఏడి మహమ్మద్ జాన్మియా కోరారు. సోమవారం నకిరేకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. యూరియా సరఫరాలో పారదర్శకత, సౌలభ్యం కల్పించడమే లక్ష్యంగా ఈ యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్ నంబర్ లేదా ఆధార్ నంబర్ ద్వారా యూరియాను బుక్ చేసుకోవడంతో పాటు, అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను కూడా యాప్ లోనే తెలుసుకోవచ్చని వివరించారు.యాప్‌లో యూరియా బుక్ చేసిన రైతులు 24 గంటల లోపు ఎరువునుతీసుకోవాల్సి ఉంటుందని, అలా తీసుకోని పక్షంలో మళ్లీ 15 రోజుల వరకు బుకింగ్ చేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న వాలంటీర్లు, వ్యవసాయాధికారుల సహాయంతో బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. డిసెంబర్ 20 నుంచి ఈ మొబైల్ యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.ఇప్పటివరకు నకిరేకల్ డివిజన్ పరిధిలోని చిట్యాల,కట్టంగూర్,కేతేపల్లి,నకిరేకల్, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలను కలుపుకొని,మొత్తం 10,083 మంది రైతులు యాప్‌లో నమోదు చేసుకోగా, 27,988 యూరియా బస్తాలను కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు.రైతులు ఇకపై ఇంటి నుంచే యూరియాను సులభంగా బుక్ చేసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా లభిస్తుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సేంద్రియ సాగుతో నేలసారం వృద్ధి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** సేంద్రియ ఎరువుల వినియోగంతోనే భూసారం పెరిగి, నాణ్యమైన పంటలు, స్థిరమైన దిగుబడులు సాధ్యమవుతాయని నార్మ్ డైరెక్టర్ గోపాల్‌లాల్ తెలిపారు. సోమ వారం మండలంలోని గడ్డిపల్లి కెవికెలో షెడ్యూల్ కులాల రైతుల కోసం నిర్వహించిన ఐదు రోజుల సేంద్రియ వ్యవసాయ శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలంగా రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేలలో సేంద్రియ కర్బన్ తగ్గి జీవశక్తి దెబ్బతింటుందని ఆయన అన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ఎంపిక చేసిన రైతులకు ట్రైనింగ్ పెట్టు మాన్యువల్ కిట్, జీవన ఎవరులు, పప్పు, పిండి, బెల్లం, వేస్ట్ డీకంపోజర్, సేంద్రియ ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. కెవికె ఇన్‌ఛార్జి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి.నరేష్ మాట్లాడుతూ ప్రస్తుతం అధికంగా ఉపయోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగుమందుల వల్ల నేలగుల్ల బారిపోవడం , నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం, సూక్ష్మ జీవుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం.కిరన ఆదర్స్, పి.అక్షిత్‌సాయి, ఎన్ సుగంది, 50 మంది రైతులు పాల్గొన్నారు.

## మహిళ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని మండల విద్యాధికారి చత్రునాయక్ మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా గరిడేపల్లి గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సన్మానించిన వారిలో ఉపాధ్యాయులు నర్సకుమారి,హైమావతి, సునీలరాణి, అమలారాణి, శాంతిప్రీయ, రమ, రాజ్యలక్ష్మి , విజయలక్ష్మి , సుజాత, సునీత, విజయలక్ష్మి , లావణ్య, శీరిష, కవితపాల్గొన్నారు.



## కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసే వారికే మంచి గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ నల్లమోతు సిద్దార్థ అన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయులు దైద సత్యంతో పాటు పలువురు సోమవారం మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నల్లమోతు సిద్దార్థల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిద్దార్థ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసి జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారి, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, లింగంపల్లి చిరంజీవి, మొండికత్తి లింగన్న, సైదులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గారకుంటతండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలు తండ్రి చంద్రు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్ బాణావత్ అరుణ రమేష్, ఉప సర్పంచ్ గుగులోతు గౌతమి సుధాకర్, వార్డు సభ్యులు గుగులోతు జాన్సీ, బాణవత్ జయరాం, గుగులోతు బాలు, వాలి, గుగులోతు మోతిలాల్, హేమ్లానాయక్, సుమన్ నాయక్, రాజునాయక్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ పాలక వర్గం ప్రజల మనోభవాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టి గ్రామపంచాయతీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## బాలికల సంరక్షణ విద్యతోనే

**ప్రజాపక్షం/అర్వపల్లి** : బాలికల సంరక్షణ, విద్యతోనే, సామాజిక సాధికారత సాధ్యమవుతుందని జిల్లా కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మహిళా శిశు సంక్షేమ శాఖలోని, జిల్లా మహిళా సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పట్ల ఉన్న వివక్షతను తొలగించి, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్‌లు వినోద్, భవ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ రూఫింగ్ ఇండస్ట్రీ ప్రారంభం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి**; మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పెండ్లీపాకల ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ రూఫింగ్ ఇండస్ట్రీని నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు సరసమైన ధరలో, నాణ్యమైన రేకులను, వస్తువులను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, టిపిసిసి సభ్యుడు డా. వేణుధర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎంఏ. సిరాజ్ ఖాన్, చిన్నఅడిశర్లపల్లి సర్పంచు పందుల వెంకటయ్యగౌడ్, మల్లేపల్లి సర్పంచు పసునూరి యుగేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేమన్‌రెడ్డి పాల్గొన్నారు.





## రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని తుంగతుర్తి సివిల్ కోర్టు జడ్జి ఎండి గౌస్‌పాషా అన్నారు. సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా తుంగతుర్తి బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్జి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు విధిగా హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ లైసెన్సు, ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లను తప్పనిసరిగా కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు సహజ కాన్పుపై అవగాహన



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సహజ కాన్పులపై డాక్టర్ భూక్య నగేష్ నాయక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారికి వివిధ వైద్య పరీక్షలు చేసి అనంతరం వారు మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళ వ్యాయామం చేయాలని, ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి, జాగ్రత్తల గురించి, సహజ కాన్పు ద్వారా కలిగే ప్రయోజనం గురించి వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయితే వారికి అందే లబ్ధి గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, సూపర్ వైజర్ లలిత, నర్సింగ్ సిబ్బంది సునీత, మాధవి, చొక్కయ్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరలను సోమవారం గ్రామ సర్పంచ్ జక్కుల రాణి యాదయ్య మహిళలకు పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఇందులో భాగంగానే వడ్డీలేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, సంఘ బంధం అధ్యక్షులు, మహిళా సంఘం సభ్యులు, వార్డు సభ్యులు తదితరుల పాల్గొన్నారు.



# వెలువర్తి వెంకటయ్యకు సన్మానం

**ప్రజాపక్షం/యాదాద్రి :** బీబీనగర్ మండలం, మాధారం గ్రామ 6వ వార్డు సభ్యులుగా ఎన్నికైన వెలువర్తి వెంకటయ్యను మహాత్మా గాంధీ తాపీ కార్మిక సహరక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం ఆ సంఘం సమావేశంలో స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మహాత్మా గాంధి తాపీ కార్మిక సహకార సంఘం డైరెక్టర్‌గా ఉన్న వెలువర్తి వెంకటయ్య తమ స్వగ్రామంలో వార్డు సభ్యులుగా ఎన్నికవ్వడంతో సంఘం సభ్యులందరూ హర్షం వ్యక్తం చేస్తూ హార్దిక శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధి తాపీ కార్మిక సహకార సంఘం అధ్యక్షుడు బర్రె నగేష్,



ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి దాసు, కార్యదర్శి తోటకూరి రమేష్, గౌరవ అధ్యక్షులు నాయిని కృష్ణ మూర్తి, బొడ్డు రవిందర్, కొమ్మగాళ్ల కృష్ణ, కుంభం నాగరాజు, వెలువర్తి రవీందర్, బర్రె ప్రభాకర్, భూషపాక కుమార్, పాక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేనిదే పెట్రోల్ పోయవద్దు

**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వస్తేనే పెట్రోల్ పోయాలని హెల్మెట్ లేనియెడల ఎట్టి పరిస్థితులలో పెట్రోల్ పోయకూడదని ఎస్ఐ ఎస్ కృష్ణయ్య బంకు యజమానులకు సూచించారు. సోమవారం మాడుగులపల్లి పోలిసులు మండలంలోని మాడులగులపల్లి, ఆగా మోత్కూర్ గ్రామాలలో ఉన్న పెట్రోల్ బంక్ మేనేజర్లు,సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి తలకు తీవ్ర గాయాలు తగిలి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో మోటర్ వాహనాల చట్టం 1988 ప్రకారం



హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరిగా అమలు చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ నో హెల్మెట్ నో పెట్రోల్ " అనే నినాదాన్ని జిల్లాలో అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, హెల్మెట్ లేకుండా పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్ అందించబడదన్నారు.

# కష్టకాలంలో నిస్వార్థంగా కాంగ్రెస్‌ని కాపాడింది చలమలనే



**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు నియోజకవర్గంలో కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని కార్యకర్తలను కాపాడిన వ్యక్తి చలమల కృష్ణారెడ్డి అని కాంగ్రెస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెలమల కృష్ణారెడ్డికి సంబంధం లేదని ప్రెస్ మీట్ ద్వారా పత్రికలలో వచ్చిన వార్తలను ఆయన ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ అప్పట్లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌తో ఎమ్మెల్యేగా గెలిచిన రాజగోపాల్ రెడ్డి బీజేపీ తరపున పోటీ చేసి కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర రాజకీయాల్లో కనుమరుగు చేయాలనే ప్రయత్నం చేశారు.అటువంటి సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీ జెండాను గట్టిగా పట్టుకొని,నిస్వార్థంగా పార్టీ కోసం నిలబడిన నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి అని అన్నారు.ఆ సమయంలో ఒక్క కార్యకర్త కూడా అధైర్యపడకుండా,ప్రతి ఒక్కరికి అండగా నిలిచి పార్టీని నిలబెట్టారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయిత గోని సైదులు, అన్నం శ్రీశైలం,పాలుట్ల కుమార్,ఈరటి చెన్నయ్య యాదవ్,మునుకుంట్ల శ్రీను గౌడ్,మునుకుంట్ల బలరాం గౌడ్,మునుకుంట్ల నరసింహ గౌడ్, మునుకుంట్ల కుమార్,బోయపల్లి శీను,సురిగి రమేష్, వేముల నరసింహ,గౌడ్,సురిగి లింగయ్య గౌడ్, ఎంజాల మధు,చేపూరి కిరణ్ పాల్గొన్నారు.

## పార్టీల సూచనల మేరకు ఓటర్లు తుది జాబితా

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అభ్యంతరాలు స్వీకరణ వివిధ రాజకీయ పార్టీల నాయకుల సూచనలు మేరకు ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు పురపాలక సంఘం, పోచంపల్లి ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించి అభ్యంతరములు, సలహాలు సూచనలు అందజేయుటకు సోమవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన మునిసిపల్ కార్యాలయం ముందు సమావేశం ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని తగు సూచనలు అనగా ఏ వార్డుకు సంబంధించిన ఓటర్లు ఆ వార్డులోనే ఉండేలా, కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే వార్డులో ఉండేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ నిర్మల, సీ.అసిస్టెంట్ రాజేష్, రాజకీయ పార్టీల నాయకులు బాత్క లింగస్వామి, మల్లేశం పాల్గొన్నారు.

## ఘనంగా మహిళ ఉపాధ్యాయ దినోత్సవం

**ప్రజాపక్షం/రామన్నపేట :** పట్టణ కేంద్రంలోని నాగార్జున పాఠశాలలో సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ఉన్నతాధికారులుగా, ఉపాధ్యాయులుగా వివిధ సబ్జెక్టులు బోధించి ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.రేఖ సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్రమ్, సంధ్య, స్వప్న, విజయశ్రీ, లత, వినిష మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## సిపిఐ శతజయంతి ఉత్సవాల సభను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ కోరారు. తుర్కపల్లి మండల కేంద్రంలో నాగపురి నరసింహ అధ్యక్షతన జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన కళ్లెం కృష్ణ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సిలువేరు దుర్గయ్య, కలకుంట్ల సత్యనారాయణ, వల్లపు భగవంతు, కాశబోయిన పెద్దులు, దాసరి బాలయ్య, కాశరబోయిన పోశయ్య, బక్కయ్య, ఆకుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ర్యాలీ




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రోడ్డు భద్రత నియమాల అవగాహనకై శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు రోడ్ షో ర్యాలీ నిర్వహించారు. ప్రజలు రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రాణాలను కాపాడుకోవాలనే నినాదంతో ఫ్లెక్సీతో సోమవారం పురపాలక కేంద్రంలో రోడ్డు భద్రత నియమాలు ప్రజలకు వివరించారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని ప్రతి ఒక్కరు హెల్మెట్ సీట్ బెల్టు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ ట్రాఫిక్ సిగ్నల్ పాటించాలనీ వాహనం నడిపేటప్పుడు రోడ్డు దాటేటప్పుడు సెల్ ఫోన్ వినియోగించరాదనీ అతివేగం నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రమాదకరమని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎడ్ల తిరుమలరెడ్డి, ఉపాధ్యాయ బృందం సిహెచ్ సుధా, కే.లలిత, రవళి, సంధ్య, శారద కేత, దివ్య జ్యోతి, రమ్య, అనూష, మాధవి పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ తోటలకు ప్రభుత్వం ప్రోత్సాహం, సబ్సిడీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ఆయిల్ పామ్ తోటలను కొత్తగా సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాలు సబ్సిడీలు అందిస్తుందని ఆర్టికల్చర్ అధికారి మౌనిక తెలిపారు. సోమవారం తుర్కపల్లి మండలంలోని తిరుమలాపురం గ్రామంలో సర్పంచ్ దొరికిన వేడుక వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయిల్ తోటలో సాగు గురించి సబ్సిడీల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులకు కలిగే లాభాలు ప్రభుత్వ పథకాలను ఎలా వినియోగించుకోవాలని అంశాలపై రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నూకల శ్రీనివాస్ యాదవ్, సెక్రటరీ బి.జ్యోతి, వార్డు మెంబెర్లు పురుమాను స్వప్న, సంపత్ యాదవ్, నాంసాని నరేష్ యాదవ్, వంగ కర్ణాకర్ రెడ్డి, నాయకులు వంగ నారాయణ రెడ్డి, కలకొండ నవీన్, పొలమైన చంద్రపాల్ రైతులు బోయిని కనకయ్య, వెంకటేష్, తూటి కిష్టయ్య, బూషి మల్లయ్య, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## వీధి కుక్కల తరలింపు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మర్రిగూడలో వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు విముక్తి లభించింది. సోమవారం సర్పంచ్ వీరమల్ల శిరీష ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది కుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాలకు తరలించారు. ఆమె మాట్లాడుతూ.. కుక్కలు బాటసారులపై దాడి చేయడమే కాకుండా,మేకలు, గొర్రెలను గాయపరుస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు.

## నిరంజన్ మృతి బాధాకరం

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందని గోరటి నిరంజన్ అకాల మరణం బాధాకరం అని బహుజన మేధావి డా. యేకుల రాజారావు, మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బోయిని చంద్రమౌళి అన్నారు. సోమవారం చెరుకుపల్లిగ్రామంలో నిరంజన్ పార్థీవదేహానికి పూల మాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాల మహానాడు గుండ్లపల్లి మండల అధ్యక్షులు మల్లేష్, దేవరకొండ మండల అధ్యక్షులు దినాకర్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మురళి, వెంకటయ్య, శ్రీను, శ్రీనివాస్, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

## సర్పంచ్‌ల ఫోరం దేవరకొండ మండల అధ్యక్షుడిగా రాంసింగ్‌నాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మైనంపల్లి గ్రామ సర్పంచ్ కొర్ర రాంసింగ్‌నాయక్‌ను మండల సర్పంచ్‌లు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చాట్ల రమాదేవి రాములు, చల్లమల్ల విజయ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ముదిగొండ శ్యామలయ్య, సహాయ కార్యదర్శిగా నేనావత్ కవిత లచ్చిరాంనాయక్, గౌరవ అధ్యక్షులుగా వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా రాత్లావత్ జగన్‌నాయక్, ఇసి సభ్యులుగా గోపాల్‌నాయక్, నేనావత్ భీముడు నాయక్, పల్లా శ్రీకాంత్‌రెడ్డి, కోన్‌రెడ్డి శ్రీను, వడిత్య పద్మ బాలరాజు, ముంత విజయలక్ష్మి మల్లేష్, పాత్లావత్ భారతి ధర్మలను దేవరకొండ పట్టణంలో స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో సర్పంచుల సమక్షంలో అందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## గ్రామాల అభివృద్ధి సర్పంచ్‌లదే

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులను చందంపేట ఎంపిడివో లక్ష్మీ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపిడివో లక్ష్మీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు ఎండి సాధిక్, విజయరాములునాయక్, దేవి గోవింద్, జలెందర్, సబితా సుక్య నాయక్ పాల్గొన్నారు.



## కెవిఆర్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలములోని రాజాపేట తండా గ్రామపంచాయతీ పరిధిలో కెవిఆర్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ చైర్మన్,సర్పంచ్, కొడాల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడిన వారం అవుతామని అందుకోసం యువత ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్ నాగోల్ చౌరస్తాలో ఎన్ఎల్ఎంఎన్ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు శిబిరంలో పాల్గొని యువత నుండి రక్తము సేకరించారు.యువకులు ఉత్సాహంతో పాల్గొని రక్త దానం చేశారు.రక్త దానం చేసిన దాతలకు ఐదు లక్షల యాక్సిడెంట్ బెన్ఫిట్ కింద ఇన్సూరెన్స్ కూడా అందజేసేందుకు ధ్రువపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మం డల యూత్ అధ్యక్షులు కొడాల అల్వాల్ రెడ్డి, బిచ్చా నాయక్,రవి,అంజిరెడ్డి, సుధీర్, నయీమ్, దేవేందర్,వెంకటేష్, పాల్గొన్నారు.

## నిరాశలో కష్టబడి పని చేసిన కార్యకర్తలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు అందరూ నిరాశలో ఉన్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఓబిసి ఉపాధ్యక్షులు తండు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1983వ సంవత్సరం నుండి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చిన కార్యకర్తలు సీనియర్లను అగౌరవపరిచి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, తెలంగాణ శాసనమండలి సభ్యుడు మహేష్ కుమార్ గౌడ్‌లు పార్టీలో ఐదు నుండి ఆరు సంవత్సరాలు కష్టపడ్డ వాళ్లకే టిక్కెట్లు ఇవ్వాలని, ఇప్పుడు కొత్తగా వచ్చిన వాళ్లకు టిక్కెట్ ఎలా ఇస్తారని అన్నారని గుర్తు చేశారు. సూర్యాపేట మున్సిపాలిటి కౌన్సిలర్ల అభ్యర్థుల కోసం ఒక కమిటి వేయాలని, అశావాహు లందరూ కమిటి అభ్యర్థులను ఎన్నిక చేయాలి కాని నేనే రాజు, నేనే మంత్రి అన్న విధంగా స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సీనియర్లకు ఖచ్చితంగా ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బస్సు డ్రైవర్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా రవాణా అధికారి జయప్రకాశ్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ సూచనల మేరకు సోమవారం పట్టణంలోని సిటి టాలెంట్ స్కూల్ నందు బస్సు, ఆటో డ్రైవర్లకు వైద్య శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సాధారణ ఆరోగ్యం, జీవనశైలి వ్యాధులు, నియమిత ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను



రక్షించే సిపిఆర్ పై అవగాహన, శిక్షణ పొంది ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ వెంకటయ్య, డిప్యూటి డెమో వి సంజీవరెడ్డి, సిహెచ్ఓ నర్సింహ, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా అభ్యంతరాలపై రాజకీయ సమావేశం



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో నందికొండ పురపాలక సంఘు కార్యాలయంలో సోమవారం మునిసిపల్ కమీషనర్ చింతా వేణు అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతోఎన్నికలలో ఓటు వేయడానికి అర్హులైన వ్యక్తుల అధికారిక ఓటరు జాబితా పబ్లికేషన్‌కు సంబంధించిన అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ తమ అభ్యంతరాలను కమీషనర్ దృష్టికి తీసుకు వచ్చారు.అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పూర్తిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపడతామని మునిసిపల్ కమీషనర్ తెలిపారు. అలాగే అందిన అన్ని అభ్యంతరాలను తక్షణమే జిల్లా ఎలెక్షన్ సెల్‌కు పంపించాలని కార్యాలయ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశం ద్వారా ఓటరు జాబితాలో పారదర్శకత,ఖచ్చితత్వం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

## ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశం

**ప్రజాపక్షం/చండూరు:** త్వరలో మున్సిపాలిటీలకు జరుగనున్న ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాపై సోమవారం చండూరు మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ మల్లేశం మున్సిపాలిటీలోని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షకార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ , నోటిఫికేషన్,పోలింగ్ స్టేషన్‌ల వివరాలు , వార్డుల వారిగా ఓటర్ల మ్యాపింగ్ వంటి అంశాలపై చర్చించారు. కాంగ్రేస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్, బిజెపి చండూరు పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్, సిపిఐ దోటి వెంకన్న పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలములోని తిరుగండ్లపల్లి పంచాయతీ కార్యాలయంలో సోమవారం హైదరాబాద్ కామినేని హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పందుల లక్ష్మమ్మ జంగయ్య గౌడ్ మాట్లాడుతూ కామినేని హాస్పిటల్ వారు అందించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ ఝాన్సీ రాణి వైద్య బృందం ఆధ్వర్యంలో బిపి, షుగర్,కంటి చెకప్, జనరల్ సంబంధించిన వ్యాధులకు చెకప్‌లు చేసి టాబ్లెట్స్,టానికులు అందించారు,ఇలాంటి కార్యక్రమాలు చేసినందుకు గ్రామ ప్రజలు సర్పంచ్ కు ధన్యవాదాలు తెలిపారు.



## రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన పుల్లెంల జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలోని జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు జనవరి 2,3వ తేదీలలో జిల్లా స్థాయిలో జరిగిన పర్యావరణ ప్రాజెక్టుల ప్రదర్శనలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికకావడం జరిగింది. రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ఇ.పూజిత సేంద్రీయ వ్యవసాయంలో, కె. శ్రీవాణి సౌరశక్తి వినియోగంతో పాటు పత్తి తీయుట పై ఈ నెల 7,8 తేదీలలో కామారెడ్డి లో జరుగు ప్రదర్శనలో పాల్గొనుటకు వెళ్తున్న సందర్భంలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, సర్పంచ్ ముక్కామల వెంకన్న, ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య విద్యార్థులను అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూతరాజు బాలరాజు, సంచాయితీ కార్యదర్శి ప్రభువర్ధన్‌రెడ్డి, అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీచైర్మన్ పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు గ్రామాలాభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/చండూరు:** గ్రామ పంచాయితీకి నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు అధికారులతో కలిసి గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఓ బండారు యాదగిరి అన్నారు. సోమవారం చండూరు ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని 19 గ్రామ పంచాయితీలకు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు తో పాటు, మండల పరిషత్ కార్యాలయం తరుపున నూతనంగా ఎన్నికైన సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీ నాగమల్లేశ్వర్ రావు, ఎంపిడిఓ బండారు యాదగిరి , మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి చంద్రిక, మండల వైద్యాధికారి మాస రాజు, మండల పంచాయితీ అధికారి సందీప్,ఏపిఓ శ్రీనివాస్ , కార్యాలయ సూపరింటెంట్ నరసింహ ,తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట ఆర్టిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట ఆర్టిస్ట్ అసోసియేషన్ నూతన కమిటి ఎన్నిక సోమవారం జిల్లా కేంద్రంలోని మిర్చియార్డులో జరిగింది. అధ్యక్షుడిగా గోవర్ధన్ (గోవర్ధన్ ఆర్ట్స్), ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ (భవాని ఆర్ట్స్), కోశాధికారి మనోఆర్ట్స్, ఉపాధ్యక్షులు విష్ణు, శేఖర్, భానులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లవేళలా ఆర్టిస్టుల అందరికి అందుబాటులో ఉంటామన్నారు. సభ్యులందరూ యూనియన్ నియమ నిబంధనలకు లోబడి ఉండాలని కోరారు. ఎలక్షన్ కమిటి మెంబర్స్ భాస్కర్, మన్సూర్, ఖదీర్, వాసు, సత్యం, రాజు, గౌరవ అధ్యక్షులు పవన్ వ్యవహరించగా, ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీను, సీనియర్ ఆర్టిస్టులు రఘు, ప్రసన్న, లతీఫ్, అలీ, సీతారామాలు పాల్గొన్నారు.





## టిఎస్ యుటిఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/అర్వపల్లి** : 2026 సంవత్సరానికి సంబంధించిన టిఎస్ యుటిఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని మండల విద్యాధికారి బి బాలు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కుంభం ప్రభాకర్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు కోటమర్తి వీరయ్య, ప్రధాన కార్యదర్శి నల్లగంటి వెంకన్న, ఉపాధ్యక్షులు కాకి సీనయ్య, జిల్లా బాధ్యులు నోముల వెంకటేశ్వర్లు, మండల బాధ్యులు జటంగి నాగయ్య, చొల్లేటి వెంకటేశ్వర్లు, ఆర్ నాగ రాజు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ర్యాలీ




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి, సరక్ష అభియాన్ రహస్య భద్రత అభియాన్ కింద సోమవారం కోర్టు ఆవరణలో రోడ్డు భధ్రత్రపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు, మొదటి అదనపు జిల్లా జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏం మమత, కోర్టు సిబ్బంది, పాఠశాల పిల్లలు, పేరా లీగల్ వాలంటీర్లు ట్రాఫిక్ సిబ్బంది, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతపై స్లోగన్స్ చేస్తూ ర్యాలీ చేశారు.

## గొర్రెలకు నట్టల నివారణకు మందుల పంపిణీ



**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ మండలంలోని తెర్యాలలో సర్పంచ్ మంత్రి లత స్వామి ఆధ్వర్యంలో 1850 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గొల్ల కుర్మ సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీకాంత్, పశు వైద్యులు మహేందర్, అనిత రైతులు బొంగు సిద్దిరాములు, బొంగు శంకరయ్య, కెమెడీ రాములు, కోర రవి, బండ పాండు, బొంగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ న్యాయవాదిగా సుక్క శ్రవణ్ నియామకం



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా(ఏజిపి) సుక్క శ్రవణ్ నియమితుల య్యారు. నా నియామకానికి సహకరించిన ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసనసభ్యులు వేముల వీరేశం, సీనియర్ న్యాయవాది మాజీ జెడ్పిటిసి జినుకల ప్రభాకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్‌తో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, మల్లారెడ్డి, జమీరుద్దీన్, అక్రమ్ పృద్వీలకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకాన్ని స్వాగతిస్తూ రామన్నపేట బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## న్యాయమూర్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ కోర్టు సముదాయంలోని ఐదవ అదనపు జిల్లా జడ్జి కెవి.చంద్రశేఖర్‌రావు, సీనియర్ సివిల్ జడ్జీ ప్రమీలజైన్‌లకు సోమవారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతిరెడ్డి, కోశాధికారి గొడ్డటి సాయికుమార్‌యాదవ్, కొంక వెంకన్న, స్వరాజ్యం, ధూపాటి మట్టయ్య, రాయారపు భాస్కర్, ఉమాశంకర్, బాలునాయక్, న్యాయవాదులు ఉన్నారు.

## ఓటరు జాబితాపై సవరణలు చేయాలని వినతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మున్సిపాలిటీ ఓటరు జాబితాపై అభ్యంతరాలు,సూచనలు, సవరణలు తెలియజేసేందుకు సోమవారం నల్లగొండ మున్సిపాలిటీ సమావేశం మందిరంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాక్ అహ్మద్ ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని పలు వార్డులలో ఓటర్ల జాబితాపై సవరణ,సూచనలు చేయడంతో పాటు మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు సమద్,సమీర్ తదితరులు పాల్గొన్నారు.



## పెద్ద తండాలో మద్యపాన నిషేధం

### తీర్మానించిన నూతన పాలక వర్గం

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని పెద్దతండా గ్రామ పంచాయతీలో నూతన పాలక వర్గం ద్వారా గ్రామ సర్పంచు కాట్రావత్ చిట్టెమ్మ అధ్యక్షతన సోమవారం జరిగిన మొదటి సభలో గ్రామంలో గుడుంబా, నాటు సారా, బెల్టు షాపులు మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేదించాలని గ్రామ సభ ద్వారా తీర్మానించారు. గ్రామ సభ తీర్మానాన్ని ఉల్లంఘించి మద్యం అమ్మకాలు జరిపితే రూ. 50వేల జరిమాన విధించడం జరుగుతుందని తీర్మానించారు. ఆదర్శ గ్రామంగా పెద్దతండా గ్రామం నిలవాలని దీనికి గ్రామ ప్రజలందరు సహకరించాలని గ్రామ సర్పంచ్ కోరారు. ఈ గ్రామ సభకు గ్రామ సర్పంచ్ కాట్రావత్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ కాట్రావత్ లక్ష్మీ, వార్డు సభ్యులు లక్ష్మి పాల్గొన్నారు.

## అధికారులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని రాందాస్ తండా గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన సందర్భంగా సర్పంచ్ మెగావత్ చిట్టి శ్రీనివాస్ నాయక్ సోమవారం మండల తహసీల్దార్ గూగులోత్ దేవాసింగ్,సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు,డిప్యూటీ తహసీల్దార్ వెంకన్నను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించినారు.ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు మెగావత్ భీముడు,ఎం.శ్రీను, వి.స్వప్న శ్రీను, ఎం.అశోక్,మాజీ సర్పంచ్ సపావత్ తావుర్య, ఎం. లాలు,మాజీ ఎంపీటీసీ భాష నాయక్‌లు పాల్గొన్నారు.





## ప్రభుత్వానికి మంచిపేరు తీసుకరావాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** నూతనంగా గెలిచిన సర్పంచులు గ్రామాలలో అభివృద్ది పనులు చేసి, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రభు త్వానికి మంచి పేరు తీసుకురావాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్ సర్పంచులకు సూచించారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా 20 మంది సర్పంచుల మద్దతుతో ఎన్నికైన కేశ్యతండా సర్పంచు రమావత్ రాజు నాయక్ సోమవారం ఆ సర్పంచులతో ఎంఎల్‌ఏ బాలునాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, బోకేలను అందజేశారు. ఈకార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఇరిగి రామకృష్ణ, రాము, కృష్ణ, రమేష్, సుగుణ, సరిత, అలివేలు తదితర సర్పంచులు పాల్గొన్నారు.

## రైతుల విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య తీర్చిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** :సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని డాకు తండా పరిది కోపులతండాలో విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యతో బాధపడుతున్న రైతులు సర్పంచ్ కరెంటోత్ శ్రీనివాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ శ్రీను నాయక్ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డికి వివరించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, 63 కెవి, ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఓవర్ లోడ్ సమస్య తీరడంతో రైతులు ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డికి తండావాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్లు, మాజీ వార్డ్ నెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలు



**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ తహసిల్దార్ కార్యాలయంలో నూతన సంవత్సరం 2026 సందర్భంగా సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సబ్ రిజిస్టర్ తహసిల్దార్ విన్నకోట నాగ దివ్య, డిప్యూటీ తాహసిల్దార్ వేములపల్లి జయలక్ష్మి లు కేక్ కట్ చేసి కార్యాలయ సిబ్బందికి, ప్రెస్ మిత్రులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మోటకొండూర్ ప్రెస్ క్లబ్‌లకు తాహసిల్దార్ నాగదివ్య బీరువాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు ఆసీఫ్, విజయ రామారావు, సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ, గోవర్ధన్, రాజు యాదగిరి, శ్రీకాంత్, పత్రిక విలేకరులు, తాహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలిరావాలి

**ప్రజాపక్షం/నాంపల్లి:** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు హలో కామ్రేడ్..చలో ఖమ్మం అనే నినాదంతో ప్రతి ఇంటికి ఒక మనిషి ప్రతి ఊరికి ఒక బండి తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి పిలుపునిచ్చారు. సోమవారం నాడు నాంపల్లి మండలం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు నాంపల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.